సాక్షి కామారెడ్డి

శుక్రవారం | 18 | ఏప్రిల్ | 2025



కల్తీ కల్లుకు దూరంగా ఉండాలి

కల్తీ కల్లుకు దూరంగా ఉండాలని కలెక్టర్ సంగ్వాన్ అన్నారు. ఈ నెల 19 నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

- IIలో ▸



కొనుగోలు కేంద్రాల్లో..

ప్రభుత్వం ఆదేశించినా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదని రైతులు అంటున్నారు.

- IIIలో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43.0 /23.2

ఉదయం నుంచి ఎండతీవ్రత క్రమంగా పెరుగుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దళారులను నమ్మి మోసపోవద్దు



పిట్లం(జుక్కల్): దళారులను నమ్మి మోసపోవద్దని, పంట దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం జొన్నలకు క్వింటాల్‌కు రూ.3,371 గిట్టుబాటు ధర కల్పించిందని తెలిపారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ శపథంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ చీకోటి మనోజ్‌కుమార్, డైరెక్టర్లు, నాయకులు, సహకార సంఘం కార్యదర్శి సంతోష్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



కామారెడ్డి టౌన్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) డాక్టర్ నరేంద్రకుమార్ వైద్యులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని గురువారం ఆయన సందర్శించారు. మెడికల్ కళాశాలలోని ఆయా విభాగాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం జీజీహెచ్‌ను సందర్శించారు. రోగులతో ఆయన మాట్లాడగా నీటి సమస్య ఉందని వారు తెలిపారు. ఆపరేషన్ థియేటర్, ప్రసూతి, మహిళ, పురుషుల వార్డులు, మెడికల్ డ్రగ్స్‌స్టోర్, ల్యాబ్, డయాలసిస్, ఐసీయూ విభాగాలను సందర్శించారు. అనంతరం సూపరింటెండెంట్ చాంబర్‌లో వైద్యాధికారులతో సమీక్షించారు. ఆస్పత్రిలో సిటీ స్కాన్, ఎంఆర్ఐ సేవలు అందుబాటులో లేవని సూపరింటెండెంట్ షరీదా డీఎంఈకి వివరించారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్, ఆర్ఎంవో రవీందర్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చట్టాలపై అవగాహన



కామారెడ్డి టౌన్: పట్టణ శివారులోని వృద్ధాశ్రమాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా న్యాయమూర్తి టి నాగరాణి గురువారం సందర్శించారు. న్యాయచైతన్య సదస్సు ఏర్పాటు చేసి వృద్ధులకు చట్టాలపై అవగాహన కల్పించారు. వారితో ఆప్యాయంగా మాట్లాడి పెన్షన్, అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు మల్లిక, దేవయ్య, శ్రీకాంత్, ఫార్మాసిస్ట్‌లు రాజ్యలక్ష్మి, పద్మ, కిశోర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలి




మద్నూర్(జుక్కల్): గర్భిణులు నాణ్యమైన ఆహారాన్ని తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో సీడీపీవో కళావతి, ఎంపీడీవో రాణి, ఏబీఐ ఎంఎస్ జిల్లా కో ఆర్డినేటర్ మోహన్, పోషణ్ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ ప్రియాంక, బాలకృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇదేం పాడు బుద్ధి!

బాలికలతో టీచర్ల అసభ్యకర ప్రవర్తన

- వారం రోజుల్లో రెండు పోక్సో కేసులు నమోదు
- నెలకొకరు అరెస్టై జైలుకు పోతున్నారు..!
- 15 నెలల్లో.. 15 కేసులు
- జిల్లా వ్యాప్తంగా షీ టీములు అప్రమత్తం



విద్యాబుద్ధులు నేర్పాల్సిన పాఠశాలల్లో పోక్సో కేసులు నమోదవుతుండడం కలకలం రేపుతోంది. బాలికలను తమ కన్నపిల్లల్లా కంటికి రెప్పలా కాపాడాల్సిన ఉపాధ్యాయులు కాటేసేందుకు ప్రయత్నిస్తున్నారు. గతేడా ది జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 15 పోక్సో కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. స్కూళ్లలో ఉపాధ్యాయులనే ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నియమించినా.. షీ టీములు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నా ఈ వారం రోజుల్లోనే రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో రెండు పోక్సో కేసులు నమోదుకావడం గమనార్హం.

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు 'కొందరు' చేస్తున్న తప్పుడు పనులతో వృత్తికి కళంకం వస్తోంది. విద్యార్థినులతో అసభ్యకరంగా వ్యవహరిస్తూ సమాజంలో పలుచన అవుతున్నారు. కొందరి అనైతిక చర్యలతో ఉపాధ్యాయ లోకానికే చెడ్డపేరు వస్తోంది. జిల్లాలో ఇటీవలి కాలంలో నమోదవుతున్న పోక్సో కేసుల్లో ఎక్కువగా స్కూళ్లలోనే జరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 15 పోక్సో కేసులు నమోదయ్యాయి. తాజాగా రామారెడ్డి మండలంలో రెండు స్కూళ్లలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించి ఇబ్బందులకు గురిచేసిన ఇద్దరు ఉపాధ్యాయులపై పోక్సో కేసులు నమోదయ్యాయి. నిజాంసాగర్ పోలీసు స్టేషన్ పరిధిలో ఒకే సంఘటనలో నలుగురిపై, అదే పీఎస్ పరిధిలో మరో కేసు నమోదైంది. ఐదుగురు టీచర్లు అరెస్టయ్యారు. లింగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో రెండు కేసుల్లో ఇద్దరు, బాన్సువాడలో ఒకరు, నాగిరెడ్డిపేటలో ఒకరు, గాంధారిలో ఇద్దరు, కామారెడ్డిలో ఒకరు, భిక్కనూరులో ఒకరు అరెస్టయ్యారు. తాజాగా రామారెడ్డి మండలంలో రెండు కేసులు నమోదయ్యాయి. వరుస ఘటనలతో ఆందోళన వ్యక్తమవుతోంది. స్కూళ్లలో ఇలాంటి పరిస్థితులు నెలకొనడంతో వృత్తి నిబద్ధతతో పనిచేసే ఉపాధ్యాయులు కొంత ఇబ్బంది పడుతున్నారు. ఎవరో ఒకరు చేసిన తప్పునకు బద్నాం అవుతున్నామనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లాలో గడిచిన ఏడాదిన్నర కాలంగా నెలకో టీచర్‌పై పోక్సో కేసు నమోదైంది. గతేడాదిలో 12 కేసులు నమోదు కాగా, ఈ ఏడాది మూడు కేసులు నమోదయ్యాయి. అంటే నెలకో కేసు నమోదైనట్టే లెక్క. నిజాంసాగర్ మండలంలోనే ఒక పాఠశాలలో నలుగురు టీచర్లు పోక్సో కేసులో అరెస్టయ్యారు. జిల్లాలోని ఏదో ఒక మండలంలో స్కూళ్లలో విద్యార్థినులు టీచర్లతో ఇబ్బందులు పడుతూ భరించలేక అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నారు. దీంతో విచారణ చేపట్టి బాధ్యులైన ఉపాధ్యాయులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తున్నారు.

సీరియస్‌గా పరిగణిస్తున్న అధికారులు

అమ్మాయిలతో అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటనలపై జిల్లా అధికారులు సీరియస్‌గా తీసుకుంటున్నారు. ఇలాంటి సంఘటనలతో విద్యార్థినులను బడికి పంపాలంటే తల్లిదండ్రులు వెనుకడుగు వేసే పరిస్థితి ఉంటుంది. ఫలితంగా పిల్లలు డ్రాప్ అవుట్ అవుతారు. ఈ నేపథ్యంలో వేధింపుల నుంచి కాపాడేందుకు మరింత కఠినంగా వ్యవహరించాలని అధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగా పోలీసు శాఖ పరిధిలోని షీ టీములను మరింత అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు విద్యార్థినులతో మాట్లాడాలని ఆదేశించారు. దీంతో ప్రతి పాఠశాలలో షీ టీము ఫోన్ నంబర్లు ఇస్తున్నారు. ఎవరైనా ఇబ్బంది పెడితే సమాచారం ఇవ్వాలని చెబుతున్నారు. ఏది ఏమైనా స్కూళ్లలో లైంగిక వేధింపులకు సంబంధించి నమోదవుతున్న పోక్సో కేసులతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి పరిస్థితి తలెత్తడం మంచిది కాదని అంటున్నారు.

చర్యలు తీసుకుంటున్నా..

జిల్లాలోని పాఠశాలల్లో జరుగుతున్న సంఘటనలను అరికట్టేందుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆధ్వర్యంలో అధికార యంత్రాంగం అనేక చర్యలు తీసుకుంది. పాఠశాలల్లో ఉపాధ్యాయులను చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్లుగా నియమించి శిక్షణ ఇచ్చారు. అలాగే షీ టీముల ఆధ్వర్యంలో విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించి, ఎవరైనా ఇబ్బంది పెడితే సమాచారం ఇవ్వాలని ఫోన్ నంబర్లు ఇచ్చారు. దీంతో వేధింపులకు గురైన బాలికలు షీ టీములకు సమాచారం చేరవేస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టి వేధిస్తున్న ఉపాధ్యాయులపై కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో అరెస్టైన ఉపాధ్యాయులు సస్పెండ్ అవుతున్నారు. పోక్సో కేసులు, అరెస్టులతో సమాజంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిసి కూడా కొందరు విద్యార్థినులతో అదే వైఖరి కొనసాగిస్తున్నారు. విద్యార్థినులు స్కూళ్లలో ఎదుర్కొంటున్న వేధింపుల గురించి బయటకు వచ్చి చెప్పేందుకు జంకుతున్నారు. బాలికల సంరక్షణ అధికారులు, షీ టీములు కల్పిస్తున్న అవగాహన కారణంగా కొందరు మాత్రమే తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్నారు.

లబ్ధిదారుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలి

- కుటుంబంలో ఒకరికి మాత్రమే ఇందిరమ్మ ఇల్లు
- మే 2న అర్హుల జాబితా ప్రదర్శన
- జూమ్ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో, ఎంపీవో, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లతో గురువారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు అర్హుల జాబితాలను ఇందిరమ్మ కమిటీ సభ్యులు పరిశీలించాలన్నారు. పేదలు, మట్టి ఇళ్లు, రేకుల షెడ్డులు, గుడిసెల్లో నివసిస్తున్న వారిని గుర్తించాలన్నారు. ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితాను 22 నుంచి 30వ తేదీ వరకు ఎంపీడీవో లు, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీవోలు, పంచాయతీ రాజ్, హౌసింగ్, ఇతర సంబంధిత శాఖల మండలస్థాయి అధికారులు మరోసారి పరిశీలించాలన్నారు. ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే ఇల్లు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. పరిశీలన పూర్తయిన జాబితాను మే 2వ తేదీన గ్రామ పంచాయతీల్లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. తుది జాబితాను జిల్లా మంత్రి ఆమోదం కోసం పంపాల్సి ఉంటుందన్నారు. మే 5 వరకు జాబితాలు పంపించాలని అధికారులకు సూచించారు. జాబితా ప్రకారం లబ్ధిదారుల వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి మంజూరు ఉత్తర్వులు పొందాలని సూచించారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీవోలు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

మాచారెడ్డి : అర్హులను ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో ఎంపిక చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మాచారెడ్డి, పాల్వంచ మండల కేంద్రాల్లో గురువారం ఆయా మండలాల పంచాయతీ కార్యదర్శులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు పేద కుటుంబాలను ఎంపిక చేసే విధంగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు చొరవ తీసుకోవాలన్నారు. అర్హుల జాబితాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎంపిక ప్రక్రియ జరగాలన్నారు. గ్రామ పంచాయతీల వారీగా సర్వే నిర్వహించి జాబితా తయారు చేయాలన్నారు. అనంతరం మాచారెడ్డిలో కొనసాగుతున్న మోడల్ ఇందిరమ్మ ఇంటిని పరిశీలించారు. ఆయన వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్‌నాయక్, మండల ప్రత్యేకాధికారి సురేశ్, జిల్లా పంచాయతీ అధికారి మురళి, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



మోడల్ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

నీటి సమస్య లేకుండా చర్యలు

- ఆర్‌డీఎంఏ షాహీద్ మసూద్
- మున్సిపల్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ

కామారెడ్డి టౌన్: పట్టణ ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నట్లు రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(ఆర్‌డీఎంఏ) షాహీద్ మసూద్ తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో రెండు రోజులకోసారి పుష్కలంగా కుళాయిల ద్వారా నీటి సరఫరా అవుతోందని, కొన్ని కాలనీల్లో మాత్రం కొంచెం ఇబ్బందులు ఉన్నాయన్నారు. నీటి ఎద్దడి ఉన్న కాలనీలకు ప్రస్తుతం 10 ట్యాంకర్ల ద్వారా నీటిని చేస్తున్నారన్నారు. భూగర్భ జలాలు అడుగంటుతుండటంతో ఆయా కాలనీల్లో నీరు రావడం లేదన్నారు. తీవ్ర నీటిఎద్దడి ఉన్న కాలనీల్లో నీటి సరఫరాపై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ అభివృద్ధి అంశాలు, సమస్యలపై అధికారులతో సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి, డీఈ వేణుగోపాల్, ఆర్‌వో రవిగోపాల్, ఏఈ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఎంఏ షాహీద్ మసూద్

భూ సమస్యల పరిష్కారానికే కొత్త పోర్టల్



మాచారెడ్డి రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



పాల్వంచలో మాట్లాడుతున్న రైతు అంజయ్య

- రైతులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు
- 2014 జూన్ 2కు ముందు సాదాబైనామాల క్రమబద్ధీకరణ
- అవగాహన సదస్సులో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

మాచారెడ్డి : ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం భూ భారతిని తీసుకొచ్చిందని, దీనిపై అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. పాల్వంచ, మాచారెడ్డి మండలాల రైతు వేదికల్లో భూ భారతి చట్టంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భ కలెక్టర్ మాట్లాడుతూ.. రోజూ రెండు మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణ, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు భూముల సర్వే, పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులను పరిశీలించనున్నట్లు తెలిపా రు. 2014 జూన్ 2కు ముందు గ్రామీణ ప్రాంతాల్లో సాదాబైనామా ద్వారా వ్యవసాయ భూమి కొనుగోలు చేసి గడిచిన పన్నెండేళ్లుగా అనుభవంలో ఉంటున్న వారికి క్రమబద్ధీకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. 2020 ఏడాదిలో అక్టోబర్ 12 నుంచి నవంబర్ 10వ తేదీ మధ్య కాలంలో క్రమబద్ధీకరణ కోసం అందిన రైతుల దరఖాస్తులపై ఆర్డీవోలు విచారణ చేపడతారని తెలిపారు. అర్హుల నుంచి ప్రస్తుత రిజిస్ట్రేషన్ చార్జి వసూలు చేసి సర్టిఫికెట్లు జారీ చేసి, రికార్డుల్లో నమోదైన తరువాత పట్టా పాస్ పుస్తకాలు అందజేస్తారని వెల్లడించారు. తహసీల్దార్ చేసిన మ్యుటేషన్లపై జారీ చేసిన పాస్ పుస్తకాలపై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవచ్చని, ఆర్డీవో ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం ఉంటే కలెక్టర్‌కు, కలెక్టర్ ఇచ్చిన తీర్పుపై అభ్యంతరం ఉంటే భూమి ట్రిబ్యునల్‌లో అప్పీల్ చేసుకోవచ్చన్నారు. భూధార్ కార్డుల జారీతో రైతులకు ఉచిత న్యాయ సహాయం అందుతుందన్నారు. కామారెడ్డి ఆర్డీవో వీణ మాట్లాడుతూ.. భూ పట్టాల మార్పులు, చేర్పుల కోసం తహసీల్దార్లు, ఆర్డీవోలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సాదాబైనామాలు, వారసత్వంగా వచ్చిన భూములపై ముప్పై రోజుల్లో విచారణ చేయడం జరుగుతుందన్నారు. గడువులోగా విచారణ చేయని పక్షంలో రిజిస్ట్రేషన్ అయినట్టుగా భావించొచ్చని స్పష్టం చేశారు. రైతులు భూభారతిపై అవగాహన పెంచుకొని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తహసీల్దార్లు హిమబిందు, శ్వేత, ప్రత్యేక అధికారులు శ్రీపతి, సురేశ్, ఎంపీడీవోలు శ్రీనివాస్, గోపిబాబు తదితరులు పాల్గొన్నారు.

❝ డబ్బులు అడుగుతుండ్రు..

తాతల నాటి భూమి రిజిస్ట్రేషన్ కోసం కార్యాలయాలకు వెళితే డబ్బులు ఇవ్వనిదే పనులు చేయడం లేదు. ప్రభుత్వమే హక్కు పత్రాలు ఇచ్చిన భూములను రిజిస్ట్రేషన్ చేయాలని వెళితే అవమానిస్తున్నారు. చట్ట ప్రకారం ఇచ్చిన హక్కు పత్రాలు దేనికీ పనికిరాకుండా పోతున్నాయి. ఇప్పటికైనా భూ భారతి చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం.

– అంజయ్య, రైతు, సింగరాయపల్లి

భూ భారతిలో మూడంచెల వ్యవస్థ

- చట్ట ప్రకారమే సమస్యల పరిష్కారం
- రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్
- లింగంపేట మండలంలో అందుబాటులోకి వచ్చిన పోర్టల్
- గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరించిన అధికారులు



సదస్సుకు హాజరైన పోతాయిపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామాల రైతులు



పోతాయిపల్లిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

లింగంపేట(ఎల్లారెడ్డి): దశాబ్దాలుగా పరిష్కారం కాని భూ సమస్యలను పరిష్కరించేందుకే భూ భారతి పోర్టల్‌ను ప్రభుత్వం తీసుకొచ్చిందని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా భూభారతి పోర్టల్‌ను నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకురాగా, అందులో లింగంపేట మండలం ఒకటి. కాగా, మండలంలోని పోతాయిపల్లిలో గురువారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో అదనపు కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. బోనాల్ గ్రామంలో నిర్వహించిన సదస్సులో ఆర్డీవో మన్నె ప్రభాకర్ పాల్గొని రైతుల సందేహాలను నివృత్తి చేసి భూ భారతి పోర్టల్‌పై అవగాహన కల్పించారు. పోతాయిపల్లిలో అదనపు కలెక్టర్ విక్టర్ మాట్లాడుతూ.. భూ భారతిలో రాష్ట్ర ప్రభుత్వం మూడంచెల వ్యవస్థను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దరఖాస్తులను పరిశీలించి చిన్నచిన్న సమస్యలను ఏడు రోజుల్లో పరిష్కరిస్తామని, ఏడు రోజుల్లో సమస్య పరిష్కారం కానిపక్షంలో మొదటి అప్పీలు ఆర్డీవోకు చేసుకోవచ్చని, 30 రోజుల్లో పరిష్కారం కానిపక్షంలో ట్రిబ్యునల్‌కు వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. గతంలో పోతి, ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల వివాదాల పరిష్కారం కోసం కోర్టుకు వెళ్లేవారని, ప్రస్తుతం భూ భారతి పోర్టల్ ద్వారా వాటిని పరిష్కరించుకునే అవకాశం ఏర్పడిందన్నారు. రెవెన్యూ, అటవీశాఖ భూముల వివాదాలకు రెండు శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేసి పరిష్కారం సూచిస్తారన్నారు. భూభారతి లింగంపేట మండలంలో పైలట్ ప్రాజెక్టుగా అందుబాటులోకి రావడం రైతుల అదృష్టంగా భావించాలన్నారు.

భూ సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోతాయిపల్లిలో 260, బోనాల్‌లో 47 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. సదస్సులో తహసీల్దార్ సురేశ్, డిప్యూటీ తహసీల్దార్ రాందాస్, ఎఫ్ఆర్‌వో ఓంకార్, మొబైల్‌పార్టీ ఎఫ్ఆర్‌వో చరణ్‌తేజ్, నారాగౌడ్, రాజు, లక్ష్మీనారాయణ, బాలయ్య, రామలింగం, అల్లూరి, గంగారాం, ఆయా గ్రామాల రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల దృష్టికి రైతులు తీసుకొచ్చిన సమస్యలు..

- దశాబ్దాలుగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను పోతాయిపల్లి రెవెన్యూ పరిధిలోని కోమట్‌పల్లి, కేశాయిపేట, అన్నారెడ్డిపల్లి, సురాయిపల్లితోపాటు తండాలకు చెందిన రైతులు అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.
- రెవెన్యూ, అటవీశాఖ మధ్య వివాదం కారణంగా 62 సర్వే నంబరులోని 80 మంది రైతులకు సంబంధించి 183 ఎకరాల సమస్య పరిష్కారానికి నోచుకోలేదు.
- 830 సర్వే నంబరులోని 400కుపైగా ఎకరాల భూమి పట్టాలను 200 మంది రైతులకు ఇవ్వగా, అందులో ప్రభుత్వ భూమి అని నమోదైంది.
- 543 సర్వే నంబరులో 300 ఎకరాలు ప్రభుత్వ భూమి అని చూయిస్తోంది.
- 367 సర్వే నంబరులోని 300 ఎకరాల్లో పోతాయిపల్లి రైతులు దశాబ్దాలుగా కాస్తులో ఉన్నారు. ఆన్‌లైన్‌లో ప్రభుత్వ భూమిగా నమోదైంది.
- పోతాయిపల్లి, బోనాల్ రెవెన్యూ పరిధిలోని గ్రామాల్లో పలువురు రైతులకు చెందిన భూముల సర్వే నంబర్లు తప్పుగా పడడం, సాదాబైనామాలు, కోర్టు కేసులకు సంబంధించినవి, ఒకరి సర్వే నంబరు మరొకరికి రావడం, సాగులో ఉన్న భూమి ఆన్‌లైన్‌లో పూర్తిగా నమోదు కాకపోవడం తదితర సమస్యలు ఉన్నాయి.

క్లుప్తంగా

సోనియా, రాహుల్‌పై తప్పుడు కేసులు



బాన్సువాడలో ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బాన్సువాడ : కేంద్ర ప్రభుత్వం కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై తప్పుడు కేసులు పెట్టాయని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. గురువారం బాన్సువాడ అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బీజేపీ కక్ష కట్టి కేసులు పెట్టిస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జంగం గంగాధర్, ఖలేక్, గురువినయ్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నార్ల సురేష్, ఎజాస్, అలిబిన్ అబ్దుల్లా, అజీం, సాయిబాబా, నర్సగౌండ, ఉప్పరి లింగం, గడుమల లింగం, ఉదయ్, నర్సింలు, వాహబ్, గంగుల గంగారం, కనుకుట్ల రాజు, కిరణ్ తదితరులున్నారు.

పీఎం దిష్టిబొమ్మ దహనం



సదాశివనగర్‌లో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని నంది విగ్రహం వద్ద పీఎం నరేంద్ర మోదీ దిష్టి బొమ్మను కాంగ్రెస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. సీఎం రేవంత్ రెడ్డిని విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ప్రధానమంత్రి దిష్టి బొమ్మను దహనం చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు లింగాగౌడ్, సీడీసీ చైర్మన్ ఇర్షా దొద్దిన్, మండల నాయకులు పాల్గొన్నారు.

పగిలిన మిషన్ భగీరథ పైపు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో గురువారం వేకువజామున మిషన్ భగీరథ పైపు పగలడంతో బస్టాండ్ ప్రాంతంతోపాటు ప్రధాన రహదారి జలమయమైంది. రెండు గంటల పాటు నీరు రోడ్డుపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. భగీరథ పైపు పగిలిన విషయాన్ని తెలుసుకున్న ఏఈ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందిని అప్రమత్తం చేసి నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేయించారు. అనంతరం పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించి సరఫరాను పునరుద్ధరించారు.

కల్తీ కల్లుకు దూరంగా ఉండాలి

- దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన
- ఈ నెల 19 నుంచి గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం: కల్తీ కల్లు కు దూరంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కల్తీ కల్లు సేవించడం ద్వారా కలిగే ఆరోగ్య సమస్యలు, దుష్ప్రభావాలపై ప్రజలను అప్రమత్తం చేయడానికి ఈ నెల 19 నుంచి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్‌లో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 7, 8 తేదీల్లో బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల పరిధి లోని దుర్కి, దామరాంచ, అంకోల్, రాంపూర్, సంగెం, గాంధారి మండలం లోని గౌరారం గ్రామాల్లో కల్తీ కల్లు బారిన పడి ఎంతో మంది ఆస్పత్రుల పాలైన సంఘటనలను గుర్తు చేశారు. కల్తీ కల్లు కారణంగా ఆయా గ్రామాలకు చెందిన 80 మందికి పైగా అస్వస్థతకు గురై బాన్సువాడ, కామారెడ్డి, నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల పాలయ్యారన్నారు. ఈ వ్యవహారంలో కల్తీ కల్లు విక్రయించిన నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామన్నారు. కల్తీ కల్లు సేవిస్తే కలిగే అనర్థాలు, దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సమస్యకు పరిష్కారం చూపే విధంగా ఈ వ్యసనం నుంచి బయట పడేలా ఆయా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించాల్సిన అవసరం ఉందని గుర్తించామన్నారు. కల్తీ కల్లు ఘటనలు వెలుగు చూసిన ఆయా గ్రామాల్లో ఓ మెడికల్ ఆఫీసర్, ఎస్‌హెచ్‌వో, ఎక్సైజ్ అధికారి, రెవెన్యూ, జీపీ అధికారులు బృందంగా 19 న పర్యటించి అవగాహన కార్యక్రమాలు చేపడతారని వెల్లడించారు.

ఈ అవగాహన కార్యక్రమాల్లో పౌర సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, గ్రామ పంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్‌లు, పోలీస్ సిబ్బంది, స్వయం సహాయక సంఘాలు, గ్రామ సమాఖ్య, మండల సమైఖ్య లను భాగస్వామ్యం చేయాలన్నారు. ఆయా గ్రామాల్లోని ముఖ్యమైన ప్రదేశాల్లో అవగాహన పోస్టర్లను అతికించాలన్నారు. విద్యార్థులు మరియు స్థానిక సంఘాలతో ర్యాలీలు నిర్వహించాలని సూచించారు.

ఆడవాళ్ల ఆత్మగౌరవం పట్టదా?

బిచ్కుంద(జుక్కల్): మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న అధికారులు వారి ఆత్మగౌరవాన్ని కాపాడే చర్యలను పట్టించుకోవడం లేదు. బిచ్కుంద బస్టాండ్‌లోని మరుగుదొడ్ల తలుపులు పూర్తిగా విరిగిపోయినా పట్టించుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో మహిళా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే ఒకరు బయట నిల్చుని చున్నీ లేదా చీర కొంగు అడ్డుగా పెట్టి నిల్చోవాల్సిన పరిస్థితి ఉంది. బిచ్కుంద బస్టాండ్ నుంచి ప్రతిరోజూ దెగ్లూర్, జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, పిట్లం, బీదర్, ఔరాద్ ప్రాంతాలకు చెందిన వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్‌లోని స్టాల్స్ ద్వారా ప్రతి నెలా ఆర్టీసీకి లక్షల్లో ఆదాయం సమకూరుతున్నా కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరుగుదొడ్ల కాంట్రాక్టర్ తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై బాన్సువాడ డిపో మేనేజర్ సరితాదేవిని వివరణ కోరగా.. మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత కాంట్రాక్టర్‌పై ఉంది. బాధ్యులపై చర్యలు తీసుకొని మరమ్మతులు చేయిస్తామన్నారు.



విరిగిపోయిన డోర్



అపరిశుభ్రంగా ఉన్న మూత్రశాలలు

అక్రమ నియామకాలను రద్దు చేయాలని డీఎంఈకి వినతి

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి మెడికల్ కళాశాలలో అక్రమంగా అవుట్ సోర్సింగ్ నియామకాలను చేపట్టారని విద్యార్థి సంఘాల నాయకులు గురువారం డీఎంఈ డాక్టర్ నరేంద్రకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మ్యాన్ పవర్ ఏజెన్సీ సంస్థ నిర్వాహకులు రూ. లక్షల్లో డబ్బులు వసూళ్లు చేసి ఉద్యోగాలు ఇచ్చారని వివరించారు. రూ. కోటి వరకు కుంభకోణం జరిగిందని ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి లావాదేవీలు విచారణ చేస్తే అవినీతి గుట్టురట్టవుతుందని తెలిపారు. అర్హులైన నిరుద్యోగులకు అన్యాయం చేశారన్నారు. కళాశాల ప్రిన్సిపల్ హస్తం సైతం అక్రమ నియామకాల్లో ఉందని ఆరోపించారు. డీఎంఈకి వివరాలతో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారణ చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్ఎఫ్ఐ, గిరిజన విద్యార్థి సంఘాల జిల్లా అధ్యక్షులు నీల నాగరాజు, ముదాం అరుణ్, వినోద్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి జీవీఎం. విఠల్, నాయకులు బుల్లెట్, అరవింద్, రవి, సంజయ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



డీఎంఈతో మాట్లాడుతున్న నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగులకు ఇంటర్మీడియట్, ఎంసెట్ కోచింగ్ ఇవ్వడానికి ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల నుంచి ఈనెల 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు ఎస్సీ కులాల జిల్లా అభివృద్ధి అధికారి రజిత ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన కళాశాలలు, దరఖాస్తులను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో స్వయంగా అందజేయాలని కోరారు.

హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

కామారెడ్డి క్రైం: జుక్కల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ అంబర్ సింగ్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులు, నేరస్తులతో అతడు చనువుగా ఉంటూ వారికి అనుకూలముగా వ్యవహరిస్తానని నమ్మించేవాడన్నారు. అలాగే వారి నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లుగా తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో అతడిపై శాఖాపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. ఈక్రమంలో అతడిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయని వివరించారు.

ధాన్యం తూకం త్వరగా ప్రారంభించాలి



లింగంపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా మానిటరింగ్ అధికారి రాధిక

లింగంపేట(ఎల్లారెడ్డి): ధాన్యం తూకం త్వరగా ప్రారంభించాలని కొనుగోలు కేంద్రాల జిల్లా మానిటరింగ్ అధికారి రాధిక సూచించారు. గురువారం ఆమె మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తరలించి 10 రోజులు దాటిపోతున్నందున వెంటనే తూకం ప్రారంభించాలని సొసైటీ సీఈవో పెంటయ్యకు సూచించారు. అంతకు ముందు రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ కొనుగోలు కేందంలో ధాన్యం తేమశాతాన్ని పరిశీలించారు.అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా వెంటనే తూకం ప్రారంభించాలని సొసైటీ సిబ్బందిని ఆదేశించారు. తూకం వేయడానికి హమాలీల కొరత ఉందని సీఈవో పెంటయ్య ఆయన దృష్టికి తెచ్చారు. తొందరగా హమాలీలను ఏర్పాటు చేసుకొని సోమవారం లోపు తూకం ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ): కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌకర్యాలు కల్పించాలని డీఆర్‌డీవో సురేందర్ అన్నారు. గురువారం మండలంలో అంకోల్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వాతావరణం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తూకం చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు పంపించాలన్నారు. ఐకేపీ ఏపీఎం గంగాధర్, రైతులు ఉన్నారు.

ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్‌గా సుమన్

నిజామాబాద్ అర్బన్: ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ సుమన్ నియమితులయ్యారు. నగరంలోని టీఎన్జీవోఎస్ కార్యాలయంలో గురువారం తెలంగాణ ఉద్యోగ గెజిటెడ్ అధికారుల జాయింట్ యాక్షన్‌కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్‌గా సుమన్‌ను సభ్యులు ఎన్నుకున్నారు.

ఫోన్ కొడితే ఆర్టీసీ బస్సుల సమాచారం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీ రీజియన్‌లోని బస్సు వేళల వివరాల కోసం ప్రయాణికులు ఫోన్ కొడితే సమాచారం అందించనున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఎం కోరారు. రీజియన్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, బాన్సువాడ, కామారెడ్డి డిపోల పరిధిలో సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు ఇలా..

ఆర్మూర్–73828 43133
బోధన్–98495 00725
నిజామాబాద్–99592 26022
బాన్సువాడ–94911 05706
కామారెడ్డి–73828 43747

కృత్రిమమేధ ద్వారా సమాజంపై ప్రతికూల ప్రభావం

- తెయూ మాస్ కమ్యూనికేషన్ ప్రొఫెసర్, సోషల్‌సైన్స్ డీన్ ఘంటా చంద్రశేఖర్



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న ప్రతినిధులు

తెయూ(డిచ్‌పల్లి): కృత్రిమమేధ ద్వారా సమాజంపై అనుకూలత కంటే ప్రతికూల ప్రభావం పడుతోందని తెలంగాణ యూనివర్సిటీ మాస్ కమ్యూనికేషన్ అధ్యాపకుడు, సోషల్‌సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ అన్నారు. పీస్ జర్నలిజం స్టడీస్ అంశంపై సౌత్‌కొరియా దేశ రాజధాని సియోల్‌లో హెచ్‌డబ్ల్యూపీఎల్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన ప్రత్యేక ఆహ్వానితుడిగా హాజరై జూమ్ ద్వారా ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా కృత్రిమమేధ ద్వారా సృష్టించిన వీడియోలు వైరల్ కావడం వల్ల కొన్ని సందర్భాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా తయారయ్యాయన్నారు. వాటి విశ్వసనీయతపై అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. సమాజాన్ని అశాంతికి గురిచేసే అంశాలపై నియంత్రణకు ప్రత్యేక మెకానిజం అవసరమన్నారు. పౌరుల హక్కుల రక్షణకు, వ్యక్తిగత గోప్యతకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన విధంగా చట్టాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో వివిధ దేశాల నుంచి వందకుపైగా ప్రతినిధులు హాజరయ్యారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గతంలో వివిధ కారణాలతో మూతబడిన మూడు బార్లకు కొత్త దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ దిలీప్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే అభ్యర్థులు ఫారం–1లో అభ్యర్థన పత్రం, మూడు కలర్ ఫోటోలు, తిరిగి చెల్లించబడని లక్ష రూపాయల డీడీ లేదా చలాన్ (నాన్ రిఫండబుల్), ఆధార్ లేదా పాన్‌కార్డ్ జిరాక్స్‌లను ఈనెల 26లోపు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈనెల 29న ఉదయం కలెక్టర్ సమక్షంలో డ్రా తీయనున్నట్లు తెలిపారు.

22న తెయూ వార్షిక దినోత్సవం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ వార్షిక దినోత్సవాన్ని ఈ నెల 22న నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5గంటల నుంచి 7గంటల వరకు వేడుకలు జరుగుతాయన్నారు. విద్యార్థులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా కమిటీ సభ్యుడిగా కోటపాటి



ఆర్మూర్: పట్టణానికి చెందిన ఉద్యమ నాయకుడు కోటపాటి నర్సింహం నాయుడును ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ, సలహా కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన మేరకు వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతినిధులు ఆయనను సలహా కమిటీలోకి తీసుకున్నారు. ఈసందర్భంగా హైదరాబాద్‌లోని యూనివర్సిటీ ప్రాంగణంలో వీసీ అల్దాస్ జానయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనను అభినందించారు. ఈ హోదా రెండేళ్ల కాలం కొనసాగుతుందని వివరించారు.

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా 'నీటి వాల్వ్'



ప్రమాదకరంగా ఉన్న నీటి వాల్వ్

కామారెడ్డి టౌన్: పట్టణంలోని 45వ వార్డులో పిట్ల గల్లీ నుంచి సుభాష్ రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ప్రమాదకరంగా నీటి వాల్వ్ ఉంది. వాటర్ ట్యాంక్ నుంచి ఆయా కాలనీలకు నీటి సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన ఈ వాటర్ వాల్వ్ కనిపించకుండా ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాదచారులకు కాళ్లకు అడ్డు తగలడంతో కిందపడి గాయాలపాలవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

చౌకబారు విమర్శలు మానుకోవాలి

నిజామాబాద్ సిటీ: బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ఇకపై కాంగ్రెస్ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు, చౌకబారు విమర్శలు మానుకోవాలని డీసీసీ అధ్యక్షుడు, చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి హితవుపలికారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు భీంగల్ పర్యటన సందర్భంగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో ప్రశాంత్‌రెడ్డి అనవసర రాద్ధాంతం చేశారని మండిపడ్డారు.

క్రైం కార్నర్

ఆర్మూర్‌లో బాలిక ఆత్మహత్య



చిట్యాల నీత (ఫైల్)

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. కోటార్మూర్‌కు చెందిన చిట్యాల మంజుల బుధవారం తన నలుగురు కూతుళ్లతో కలిసి ఇంటి సమీపంలోనే ఉన్న మహాలక్ష్మీ అపార్ట్‌మెంట్‌లో శుభకార్యానికి వెళ్లింది. రాత్రి 10గంటల సమయంలో మూడో కూతురు నీత(17)కు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో భరించలేక అపార్ట్‌మెంట్ ఐదవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే సమీప ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

డ్రెయినేజీలో పడి ఒకరి మృతి

దోమకొండ: మండలకేంద్రంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి మృతిచెందాడు. ఎస్సై స్రవంతి తెలిపిన వివరాలు ఇలా.. దోమకొండకు చెందిన నాగరపు అనిల్(31)జులాయిగా తిరగడంతో భార్య అతడిని విడిచివెళ్లింది. దీంతో అతడు మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 11న మధ్యాహ్నం అతడు ఇంటి నుంచి వెళ్లి, తిరిగిరాలేదు. గురువారం గ్రామ శివారులోని పెద్ద మురికికాలువలో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

టిప్పర్ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో గురువారం టిప్పర్ బోల్తాపడడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మొరం లోడ్‌తో ఉన్న టిప్పర్ గురువారం తాడ్వాయి మండల కేంద్రం నుంచి కామారెడ్డి వైపు బయలుదేరింది. తాడ్వాయి శివారులోని పోచమ్మ ఆలయం సమీపంలోగల మూలమలుపు వద్ద టిప్పర్ అదుపుతప్పి పల్టీలు కొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు గమనించి అతడిని వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు. డ్రైవర్ స్పీడ్‌గా నడపడం, అజాగ్రత్త డ్రైవింగ్ వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొంటున్నారు.

అన్నను చంపిన తమ్ముడికి జీవిత ఖైదు

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలో ఏడాది క్రితం జరిగిన హత్య కేసులో నిందితుడికి బోధన్ కోర్టు జీవితఖైదు విధించింది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు ఇలా.. పాత పోతంగల్ గ్రామానికి చెందిన దిమ్మెలవార్ గోవింద్ (55)ను 2024 ఏప్రిల్ 4న అతడి తమ్ముడు విఠల్ హత్యచేశాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అప్పటి రుద్రూర్ సీఐ జయేష్‌రెడ్డి నిందితుడిని అరెస్ట్ చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో విఠల్‌కు జీవిత ఖైదు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి రవికుమార్ గురువారం తీర్పు వెల్లడించారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం అధికారులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 12 మంది పట్టుబడ్డారు. వీరందరికీ సిబ్బంది కౌన్సెలింగ్ నిర్వహించి, కోర్టులో హాజరుపర్చారు. వీరిలో ఐదుగురికి జడ్జి రూ.8500 జరిమానా విధించగా, ఏడుగురికి రెండురోజుల జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు.

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంకన్‌డ్రైవ్ కేసులో పట్టుబడ్డ ఒకరికి బోధన్ కోర్టు జడ్జి ఒక రోజు జైలు విధించినట్లు ఎస్సై సునీల్ గురువారం తెలిపారు. అలాగే రూ. వెయ్యి జరిమానా విధించినట్లు తెలిపారు.

వర్ని: మండలంలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా కారేగాం తండాకు చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని పోలీసులు బోధన్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు వర్ని ఎస్సై మహేష్ తెలిపారు.

నకిలీ న్యాయవాదిపై కేసు నమోదు!

ఖలీల్‌వాడి: నగరంలో నకిలీ సర్టిఫికేట్లతో న్యాయవాదిగా చలామణి అవుతున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని అరుంధతీనగర్‌కు చెందిన దీపక్‌కు, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కాప్రా మండలంలోని చక్రిపురంకు చెందిన గోడిసే బాలశకుంతల దేవి పెద్దకుతూరు కరుణకుమారితో 2004లో వివాహం జరిగింది. పెళ్లి సమయంలో దీపక్ న్యాయవాదిగా పనిచేస్తున్నట్లు వధువు కుటుంబీకులకు తెలిపారు. దీపక్ మరో మహిళను రెండో వివాహం చేసుకున్నాడని, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు బాలశకుంతల దేవికి ఇటీవల తెలిసింది. దీంతో ఆమె అల్లుడి వివరాలు తెలుసుకునే క్రమంలో అతడి డిగ్రీ సర్టిఫికెట్లు, ఎల్ఎల్‌బీ సర్టిఫికెట్లు నకిలీవిగా గుర్తించారు. ఈమేరకు నకిలీ సర్టిఫికెట్లతో న్యాయవాదిగా కొనసాగుతున్న దీపక్‌పై చర్యలు తీసుకువాలని ఆమె ఫిర్యాదు చేయగా ఒకటోటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఎస్‌హెచ్‌వో రఘుపతిని వివరణ కోరగా కేసు విచారణ జరుగుతుందన్నారు.

తిమ్మాపూర్‌లో చోరీకి యత్నం

దుండగుడిని పట్టుకున్న గ్రామస్తులు



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలోగల ఓ ఇంట్లో ఇద్దరు దుండగులు చోరీకి యత్నించగా, ఓ దుండగుడిని గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. బిచ్కుందకు చెందిన ఇద్దరు యువకులు కడమంచి రమేష్, శ్రీకాంత్ గురువారం ఉదయం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి పాత ఇంటిలో ఉంచిన ట్రాక్టర్‌కు సంబంధించిన పాత ఇనుప సామాన్లను చోరీ చేసేందుకు యత్నించారు. వెంటనే ఇంటి యజమాని వారిని గుర్తించి కేకలు వేశారు. గ్రామస్తులు ఇంటి వద్దకు వచ్చి నిందితులను పట్టుకునేందుకు యత్నించగా ఒకరు పారిపోగా రమేష్ గ్రామస్తులకు చిక్కాడు. గ్రామస్తులు వివరాలు సేకరించి అతడిని పోలీసులకు అప్పగించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి అదృశ్యం



మహమ్మద్ షబ్బీర్ (ఫైల్)

కామారెడ్డి క్రైం: జిల్లాకేంద్రంలోని బతుకమ్మకుంట కాలనీకి చెందిన మహమ్మద్ షబ్బీర్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. కాలనీకి చెందిన అతడు కూలీ పనులు చేసుకునేవాడు. కొద్దిరోజులుగా మతిస్థిమితం సక్రమంగా ఉండటం లేదు. గతంలో చాలా సార్లు ఇంట్లో చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయి తిరిగి వచ్చేవాడు. కానీ ఈనెల 13న ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అతడు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు చాలాచోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో అతడి భార్య కమర్ బేగం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.